పర్యవేక్షించం.. పట్టించుకోం!

ఇప్పుడైనా స్పందిస్తారో లేదో!



ఎఫ్ఓబీలోని లిఫ్ట్ అద్దం ధ్వంసమైన దృశ్యం. గోడలపై పాన్‌పరాగ్ మరకలు





కుకట్‌పల్లి కేపీహెచ్‌బీ ప్రధాన రహదారిలో ఉన్న ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ నిర్వహణను గాలికొదిలేశారు. దీంతో పాదచారులకు ఇబ్బందులు తప్పడం లేదు. వృద్ధులు, మహిళల ఏర్పాటు చేసిన లిఫ్ట్ పనిచేయడం లేదు. ఈ లిఫ్ట్ అద్దాలు ధ్వంసం చేశారు. అంతేకుండా లిఫ్ట్ వద్ద చెత్తాచెదారం పేరుకుపోయింది. బ్రిడ్జ్‌పై ఓ ప్రాంతంలో రేకులు ఊడిపోతున్నాయి. భద్రత కోసం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు సైతం ధ్వంసం చేశారు. కొందరైతే ద్విచక్రవాహనాలను లిఫ్ట్ వద్ద పార్కింగ్ చేసి వెళ్లిపోతున్నారు. బ్రిడ్జ్ మెట్ల వద్ద పోకిరీలు రాత్రి వేళల్లో మద్యం తాగుతున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. ఈ ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ పరిసరాలు దుర్గంధంగా.. భయానకంగా మారాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందిస్తారో లేదో చూడాలి. – సాక్షి, ఫొటోగ్రాఫర్





ఎఫ్ఓబీలోని లిఫ్ట్ వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం. లిఫ్ట్ పక్కనే మద్యం బాటిళ్లు

వీకర్‌సెక్షన్ కాలనీ సమస్యలను పరిష్కరిస్తా

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ...

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరనగర్ వీకర్‌సెక్షన్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు నూతనంగా ఎన్నుకోబడిన కాలనీ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు గురువారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే గాంధీ నూతన కార్యవర్గ సభ్యులను శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసోసియేషన్ నాయకులు కాలనీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కాలనీలో అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. కాలనీ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని తెలిపారు. ఏ చిన్న సమస్య వచ్చినా కార్పొరేటర్ దృష్టికి లేదా తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తానని తెలిపారు. ప్రతి ఒక్కరు సమష్టిగా కలిసి కాలనీ అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఒక ఆదర్శవంతమైన కాలనీగా తీర్చిదిద్దే క్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, వీకర్‌సెక్షన్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు కె.కొండల్‌రావు, ఉపాధ్యక్షుడు కె.నాగార్జునాచారి, రాజశేఖర్, కార్యదర్శులు వినయ్, పోతురాజు, కోశాధికారి బాలలింగం, మునేశ్వర్ రావు, వెంకటేశ్వర్లు, కిషన్, గోపీనాథ్ సూరి, ప్రకాష్,వెంకటేష్,ఉషారాని,లతీఫ్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గాంధీని కలిసిన వీకర్‌సెక్షన్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఎన్‌టీఆర్‌నగర్‌లోని శ్రీషిర్డి సాయిబాబా దేవాలయం ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా గురువారం పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం హారతి, రుద్రాభిషేకం , మధ్యాహ్న హారతి, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పాల్గొని పూజలు చేశారు. అనంతరం ఆయన చేతుల మీదుగా ఆలయ నూతన కేలండర్‌ను ఆవిష్కరించారు.

అమ్మవారికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని కైదమ్మకుంట చెరువు వద్ద ఉన్న కట్ట మైసమ్మ దేవాలయంలో గురువారం ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీకి దేవాలయ కమిటి సభ్యులు శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం అన్న వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అర్ధరాత్రి బైక్ స్టంట్లు.. ఆరుగురి అరెస్ట్

గచ్చిబౌలి: ఐటీ కారిడార్‌లో అర్ధరాత్రి బైక్‌లతో స్టంట్లు చేస్తున్న ఆరుగురు యువకులను రాయదుర్గం పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన మేరకు.. నాలెడ్జి సిటీలోని టీ హబ్ రోడ్డులో గురువారం తెల్లవారు జామున 2 గంటలకు బైక్‌లతో స్టంట్లు చేస్తున్నట్లు సమాచారం అందించింది. ఎస్‌ఓటీ పోలీసులు లంగర్‌హౌజ్‌కు చెందిన షేక్ సల్మాన్(21), అఫ్రోజ్‌ఖాన్(20), మహ్మద్ సోహెల్(20), ఇమ్రాన్ ఖాన్, మీర్ షోహెల్(20) ఎండి ఇమ్రాన్ ఖాన్(21)లను అదుపులోకి తీసుకొని రాయదుర్గం పోలీసులకు అప్పగించారు. నిందితుల నుంచి ఒక పల్సర్, ఒక బుల్లెట్, రెండు యాక్టివాలను స్వాధీనం చేసుకున్నారు.

మహిళా సంఘాల ఆర్‌పీ సభ్యులకు అండగా ఉంటాం



ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి సమస్యలపై వినతిపత్రం అందజేసిన ఆర్‌పీ సభ్యులు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని మహిళా సమాఖ్య సంఘాల రిసోర్స్ పర్సన్స్ గురువారం పలు సమస్యలపై స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. మహిళా సంఘాల ఆర్‌పీ సభ్యులను అన్ని విధాలుగా అండగా ఉంటానని, ప్రతి సమస్యను సత్వర పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు.

జగదీశ్వర్‌గౌడ్‌కు వినతి..

శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్‌ను రిసోర్స్ పర్సన్స్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పద్మ ఆయన నివాసంలో గురువారం కలిసి వారి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏకాంత్‌గౌడ్, అల్వాల్ భాస్కర్, కవిత, సువర్ణ, రాధ, సరిత తదితరులు పాల్గొన్నారు.



జగదీశ్వర్‌గౌడ్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆర్‌పీ సభ్యులు

అభివృద్ధి పనులపై జెడ్‌సీతో సమీక్ష

భాగ్యనగర్‌కాలనీ: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశంలో ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులు చేపడతామని శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ వి.జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. గురువారం ఆయన కూకట్‌పల్లి జెడ్‌సీ అభిలాష అభినవ్‌ను కలిసి నియోజకవర్గ అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని హైదర్‌నగర్, వివేకానందనగర్, ఆల్విన్‌కాలనీ, కూకట్‌పల్లిలోని కొన్ని ప్రాంతాల్లో చేపట్టవలసిన అభివృద్ధి పనులపై పక్కా ప్రణాళికలు సిద్ధం చేయాలని జెడ్‌సీని కోరామని తెలిపారు. శేరిలింగంపల్లి ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యకరమంలో మాజీ కార్పొరేటర్ భానుప్రసాద్, సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, కూన సత్యంగౌడ్, నల్ల సంజీవరెడ్డి, నాగేశ్వరరావు, సిందం శ్రీకాంత్, విద్యాకల్పన ఏకాంత్‌గౌడ్, నాగమణి యాదగిరి, మారెళ్ల శ్రీనివాసరావు, బసంత్ రాజ్, శిరీష సత్తూర్ తదితరులు పాల్గొన్నారు.



కూకట్‌పల్లి జెడ్‌సీ అభిలాష అభినవ్‌తో జరిగిన సమీక్ష సమావేశంలో జగదీశ్వర్‌గౌడ్

సీఆర్ ఫౌండేషన్‌లో మహిళలకు నైపుణ్య శిక్షణ కేంద్రం

హఫీజ్‌పేట్ : కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్ నీలం రాజశేఖర రెడ్డి రీసర్చ్ సెంటర్‌లో ఉచితంగా మహిళలకు కంప్యూటర్ శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నారు. మహిళలకు స్వయం ఉపాధి కోసం టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మగ్గం, డైయింగ్, ప్రింటింగ్, బ్యూటీషియన్, స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్‌కు సంబంధించిన పరిజ్ఞానం, ట్యాలీ, డీటీపీ తదితర శిక్షణలు ఉచితంగా అందిస్తున్నారు. సంవత్సరానికి నాలుగు బ్యాచ్‌లుగా, ఒకోక్క బ్యాచ్‌కు మూడు నెలల పాటు శిక్షణ కార్యక్రమం ఉంటుంది. ఒక బ్యాచ్‌లో సుమారు 100 మంది మహిళలు ఉంటారు. 15 సంవత్సరాల వయస్సు నుంచి 35 సంవత్సరాల మధ్యలో గల చిన్నారులు, మహిళలు ఈ శిక్షణలో పాల్గొనవచ్చు. వివరాలకు 9603196925 నెంబరుకు ఫోన్‌చేయవచ్చు.

ఘనంగా బీబీసీ మినిస్ట్రీస్ వార్షికోత్సవం



భాగ్యనగర్‌కాలనీ: కూకట్‌పల్లిలోని బీబీసీ మినిస్ట్రీస్ వార్షికోత్సవ వేడుకలు మూడు రోజుల పాటు కనుల పండుగగా జరిగాయి. ఈ సందర్భంగా భగవంతుడికి పూర్తి విధేయత చూడనమే దీనికి ఏకైక పరిష్కారమని ప్రముఖ సువార్తీకులు రెవరెండ్ డాక్టర్ డేవిడ్ ప్రశాంత్ గొల్లపల్లి తెలిపారు. విధేయత పేరుతో మరో నాలుగు రకాల విధేయతలు ప్రత్యక్షమవుతుంటాయని డాక్టర్ డేవిడ్ గొల్లపల్లి వివరించారు. ప్రసిద్ధి విధేయత, పాక్షిక విదేయత, ప్రేక్షక విధేయత, ప్రేరిత విధేయత అనే ఉచ్చుల్లో చిక్కుకోకుండా విధాతకు పూర్తి విధేయత చూపాలని సూచించారు. దేవుడు కనిపించి మాట్లాడాడు అంటూ.. తప్పుగా ప్రచారం చేస్తుంటారని ఇదంతా తప్పని తేల్చి చెప్పారు. క్రిస్టియన్ సమాజంలో నో అని చెప్పాల్సి వచ్చినప్పుడు, ప్రార్థన చేసి చెబుతామని అంటుంటారని డాక్టర్ గొల్లపల్లి చెణుకులు విసిరారు. ఈ కార్యక్రమంలో బీసీసీ సంఘపెద్దలో హనోక్ ఆర్థర్, రత్నమయ్య, సతీష్ మంద్రు, క్వయర్ టీమ్ బాధ్యులు పాస్టర్ జాలీ సామ్, హోలీ యూత్ టీమ్ డైరెక్టర్ జిన్నీ సామ్, నిర్మల, తదితరులు పాల్గొన్నారు. వార్షికోత్సవ వేడుకలను విజయవంతం చేయడంలో సహకరించిన ప్రతి ఒక్కరికి బీసీసీ మినిస్ట్రీస్ అధ్యక్షుడు, సంఘకాపరి రెవరెండ్ డాక్టర్ విప్పర్తి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా హోలి యూత్ టీమ్ ప్రదర్శించిన డ్యాన్సులు, స్పెషల్ సాంగ్స్ ఆహుతులను ఎంతగానో అలరించాయి.

బెస్ట్ యాక్షన్ హీరోగా సింగం మహేశ్



ప్రముఖ ఫైట్ మాస్టర్స్ రామ్, లక్ష్మణ్‌లు నటుడు సింగం మహేశ్‌ను అభినందించారు. 'ఇండియన్ ఫిలిం మేకర్స్ అసోసియేషన్'(ఐఎఫ్ఎంఏ) ఆధ్వర్యంలో ఇటీవల తిరుపతి మహతి ఆడిటోరియంలో అవార్డులు ప్రదానోత్సవం జరిగింది. చేశారు. 2020 నుంచి 2024 జనవరి వరకూ విడుదలైన సినిమాల్లో ఉత్తమ సినిమాలు, వివిధ విభాగాలకు అవార్డులను అందించారు. ఇందులో భాగంగా '302'సినిమాకు బెస్ట్ యాక్షన్ హీరోగా సింగం మహేశ్‌కి అవార్డు దక్కింది. శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి పీఠాధిపతులు మూర్తి స్వామి చేతులమీదుగా మహేశ్ అవార్డు అందుకున్నారు. యాక్షన్ హీరో అవార్డు అందుకున్న సింగం మహేశ్‌ను రామ్, లక్ష్మణ్ మాస్టర్స్ అభినందించి, భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. – సాక్షి, సిటీబ్యూరో

బహిరంగ ప్రదేశంలో చెత్త వేయొద్దు



చెత్తను బహిరంగ ప్రదేశంలో వేయవద్దని అవగాహన కల్పిస్తున్న అంజిరెడ్డి, కార్మికులు

మోతీనగర్: చెత్తా, చెదారాన్ని ఎక్కడపడితే అక్కడ బహిరంగ ప్రదేశంలో పడవేయకుండా ఇంటి ముందుకొచ్చే స్వచ్ఛ ఆటో వారికి అందజేయాలని ఎంసీహెచ్‌ఎస్ మాజీ అధ్యక్షుడు నలమాల్పు అంజిరెడ్డి పేర్కొన్నారు. గురువారం మోతీనగర్ ప్రధాన వీధుల్లో జీహెచ్‌ఎంసీ సౌజన్యంతో ఎంసీహెచ్‌ఎస్ సహకారంతో పలు ప్రాంతాల్లో బ్యానర్లు ఏర్పాటు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దని.. ప్లాస్టిక్ నిషేధం అంటూ బ్యానర్లపై రాశారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ.. బహిరంగ ప్రదేశంలో చెత్త వేయుట నిషేధమన్నారు. వేసిన వారిపై జరిమానాను జీహెచ్‌ఎంసీ అధికారులు విధిస్తారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఇంటి ముందుకు వచ్చే స్వచ్ఛ ఆటో వారికి చెత్తను తడి, పొడి చెత్తను వేరు చేసి అందించాలని సూచించారు. చేయిచేయి కలుపుదాం.. పర్యావరణాన్ని కాపాడుతూ ప్లాస్టిక్‌ని నిషేధిద్దాం అంటూ నినదించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏ వై.నరేందర్, నాయకులు వెంకటస్వామి, చింటూరాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలి

కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఎన్‌టీఆర్ నగర్ నుంచి పీజేఆర్‌నగర్‌కు వెళ్లే సీసీ రోడ్డు కోసం గతంలో మంజూరై, ప్రస్తుతం నిర్మాణం జరుగుతున్న పనులను గురువారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 లక్షల రూపాయల నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. వర్షపు నీరు నిల్వకుండా లెవెలింగ్ ప్రకారం నిర్మాణం చేపట్టాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, గుడ్ల శ్రీనివాస్, సీహెచ్.భాస్కర్, పోశెట్టిగౌడ్, మహేష్, మహబూబ్, వర్కు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌టీఆర్‌నగర్ వద్ద నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

మట్టి వ్యర్థాలు తొలగించండి





పట్టించుకోని సంబంధిత అధికారులు



అల్లాపూర్, మూసాపేటలోని పలు ప్రాంతాల్లోని నాలాల నుంచి తీసిన వ్యర్థాలు

మోతీనగర్: కాలనీలు, బస్తీల్లోని ఓపెన్ నాలాలో పూడిక తీసిన మట్టిని తరలించకపోవంతో తిరిగి అది నాలాలోకి వెళ్తోంది. అల్లాపూర్, మూసాపేట డివిజన్లలోని ఇళ్ల మధ్య ఉన్న ఓపెన్ నాలాల్లో కొన్ని నెలల నుంచి నాలాల నుంచి తీసిన మట్టి, ఇతర వ్యర్థాలను నాలాలపైనే రోడ్డు పక్కన పోయటంతో ఎండిపోయి పలు జంతువులు సైతం చిందరవందర చేస్తున్నాయి. దీంతో దుర్గంధం, దుర్వాసన వెదజల్లుతోంది.

◆ అల్లాపూర్ డివిజన్‌లోని జ్యోతినగర్, లక్ష్మీనగర్, వి.రామారావు నగర్, గాయత్రినగర్, అల్లాపూర్, న్యూ అల్లాపూర్ సెంట్రల్ అదే విధంగా మూసాపేట డివిజన్‌లోని అవంతినగర్ తోట, కబీర్‌నగర్, స్నేహపురి కాలనీల్లోని ఇళ్ల మధ్య ఉన్న ఓపెన్‌నాలాల నుంచి తీసిన మట్టి నెలల తరబడి నాలా పక్కనే రోడ్డుపైనే ఉండటంతో వాహనదారులు, పాదచారులు, సమీప నివాసితలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

◆ అంతేకాకుండా రాత్రి వేళల్లో రోడ్డుకు అడ్డంగా ఉండటంతో రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి పూర్తిగా పనుల కోసం టెండర్లు వేసి బూడిదలో పోసిన పన్నీరు లాగా తయారైందని ఆయా ప్రాంతవాసులు వాపోతున్నారు. అంతేకాకుండా సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయి. తీసిన నాలాలోని మట్టిని సకాలంలో తరలించకపోవటంతో మట్టి తిరిగి నాలాలోకి పోయి సమస్య ఏర్పడుతోంది. ఇటీవల గత ప్రభుత్వం నాలా విస్తరణ పనులు చేపట్టి వాటిని కూడా అసంపూర్తిగా వదిలేసింది.

◆ ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి నాలాలోని మట్టిని వెంటనే తరలించాలని, లేకపోతే ఆయా ప్రాంతాల్లో నివసించే ప్రజలు అనారోగ్యం భారిన పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాలాకు ఒక పక్క పాఠశాల, మరో పక్క ప్రభుత్వ చౌకధరల దుకాణం సైతం ఉన్నాయి. అదే విధంగా అల్లాపూర్ డివిజన్‌లోని సఫ్దార్‌నగర్, రాజీవ్‌గాంధీ నగర్‌లో కూడా ఇళ్ల మధ్య ఓపెన్ నాలాల్లో తీసిన వ్యర్థాలను నెలల తరబడి ఉంచుతున్నారు.

◆ గతంలో పలుమార్లు నాలాలో నుంచి తీసిని మట్టిని వెంటనే తరలించాలని అధికారులకు ఆయా కాలనీవాసులు మొర పెట్టుకున్నా ఫలితం లేదని వాపోతున్నారు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా, అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే ఇటువంటి సంఘటనలు తరచూ పునరావృతం అవుతున్నాయని ఆయా బస్తీ, కాలనీల వారు వాపోతున్నారు. ఇప్పటికైనా పూడిక తీసిన మట్టిని వెంటనే తరలించి ఇబ్బంది లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు.

గావ్ చలో... బస్తీ చలో



బస్తీల్లో పర్యటిస్తున్న మధ్యప్రదేశ్ బీజేపీ ఇన్‌చార్జ్ మురళీధర్‌రావు, నాయకులు

మూసాపేట: మూసాపేట డివిజన్‌లో బుధవారం 'గావ్ చలో.. బస్తీ చలో'కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మధ్యప్రదేశ్ బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జ్ మురళీధర్‌రావు పాల్గొని వివిధ కుల సంఘ నాయకులు, బీజేపీ నేతలతో కలిశారు. కేంద్రప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అందితే ఏ ఏ పథకాలు అందాయని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు కేంద్ర ప్రభుత్వ పథకాలు ఎన్నో అమలు చేశారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు పథకాలు అందేలా స్థానిక నాయకులు కృషి చేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి బీజేపీ కన్వీనర్ శ్రీకర్‌రావు, మూసాపేట డివిజన్ ప్రెసిడెంట్ పిట్ల మనోహర్, నాయకులు ఉప్పల చంద్రశేఖర్, సాయి, కిషోర్, యాదగిరి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.